ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
శనివారం 2 మార్చి 2024


అన్నారం బ్యారేజీని పరిశీలిస్తున్న కేటీఆర్

మేడిగడ్డ బ్యారేజీ వద్ద పరిసరాలు పరిశీలిస్తున్న కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పాడి కౌశిక్‌రెడ్డి

పంటలు ఎండుతున్నాయి

కోపం ఉంటే మాపై తీర్చుకోండి.. రైతులపై కాదు

- మేడిగడ్డ సందర్శనలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- నిర్లక్ష్యం చేయకుండా పునరుద్ధరించాలని ప్రభుత్వానికి డిమాండ్
- హరీశ్‌రావు తదితర నేతలతో కలిసి పర్యటన

భూపాలపల్లి/మహదేవపూర్ రూరల్/మహదేవపూర్/కృష్ణకాలనీ, మార్చి 1 : కాళేశ్వరం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిర్లక్ష్య ధోరణి కారణంగా పంటలు ఎండిపోతున్నాయని, ప్రభుత్వానికి తమపై కోపముంటే తమపైనే చూపాలి కానీ రైతులపై చూపొద్దని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామరావు పేర్కొన్నారు. చలో మేడిగడ్డ కార్యక్రమంలో భాగంగా రోడ్డు మార్గాన హైదరాబాద్ నుంచి బస్సులో మేడిగడ్డకు చేరుకున్న కేటీఆర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధుల బృందం బ్యారేజీ ముఖద్వారం నుంచి ప్రత్యేక వాహనాల్లో కుంగిన ప్రాంతానికి వెళ్లారు. పగుళ్లు తేలిన పిల్లరును, కుంగిన ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ప్రాజెక్టు అంటే మేడిగడ్డ బ్యారేజీ ఒక్కటే కాదని.. వందల కిలోమీటర్ల మేర సొరంగాలు, కాలువలు, పంప్‌హౌజ్‌లు, బ్యారేజీల్లాంటి వంద అంకాలతో కూడుకున్న సాగు, తాగునీటి ప్రాజెక్టు అని వివరించారు. ఇంత పెద్ద ప్రాజెక్టులో ఒకటైన మేడిగడ్డ బ్యారేజీలో చిన్న సమస్య ఎర్పడితే పునరుద్ధరించాల్సిపోయి.. చిల్లర రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. 1.6కిలోమీటర్ల పొడవున్న బ్యారేజీలో 50మీటర్ల మేర సమస్య ఎర్పడితే దాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం భూతద్దంలో చూపిస్తూ, పనికిరాని ప్రాజెక్టు అని, రూ.లక్షకోట్లు నీటిపాలయ్యాయని ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో కట్టిన కడెం, గుండ్లసాగర్ తదితర ప్రాజెక్టుల్లో లోపాలున్నా తామెప్పుడూ రాజకీయం చేయలేదని, తమ ప్రభుత్వం వచ్చాక మరమ్మతులు చేయించామన్నారు. ఇంజనీరింగ్ నిపుణులు బ్యారేజీ పునరుద్ధరణకు వీలుందని చెబుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. వరదలు ప్రారంభం కాకముందే కాఫర్‌డ్యాం ఏర్పాటు చేసి పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఖరితో కరీంనగర్ సహా పలు జిల్లాల్లో పంటలు ఎండుతున్నాయన్న కేటీఆర్ సాగునీటిని అందించి రైతులను ఆదుకోవాలన్నారు. అనంతరం సీనియర్ ఇంజనీరు దామోదర్ రెడ్డి మాట్లాడుతూ బ్యారేజీలో సమస్యను గుర్తించి మరమ్మతులు చేపడితే నీటిని నిల్వ చేసి రాష్ట్రానికి సాగునీరందించవచ్చన్నారు. బ్యారేజీలో వచ్చిన సమస్యను పరిష్కరించుకుని భవిష్యత్‌లో జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందన్నారు. మిగతా బ్యారేజీల్లోనూ సమస్యలుంటే వాటిని ముందుగానే గుర్తిస్తే సరిపోతుందన్న ఆయన 93మీ టర్ల వరకు నీటిలెవల్ ఉంచి నీటిని ఎగువకు పంపింగ్ చేసుకోవచ్చని తెలిపారు.


అన్నారం బ్యారేజీ వద్ద పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇస్తున్న కడియం శ్రీహరి


మేడిగడ్డ బ్యారేజీ వంతెనపైకి వచ్చిన బీఆర్‌ఎస్ శ్రేణులు

అన్నారం బ్యారేజీ వద్ద పవర్‌పాయింట్ ప్రజంటేషన్

- కాంగ్రెస్ తీరుపై కడియం శ్రీహరి, హరీశ్‌రావు మండిపాటు

మేడిగడ్డ సందర్శన అనంతరం అన్నారం బ్యారేజీ వద్దకు చేరకున్న బీఆర్‌ఎస్ నేత బృందం అక్కడ ప్రాజెక్టు అవసరతతో పాటు మరమ్మతులు ఏమేరకు సాధ్యమో వివరించేందుకు పవర్‌పాయింట్ ప్రజెంటే షన్‌ను ఏర్పాటు చేసింది. మాజీ నీటిపారుదల శాఖ మంత్రి, బీఆర్‌ఎస్ నేత, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఈ పీపీటీలో ప్రాజెక్టు సమగ్రస్వరూపాన్ని వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కడి యం, హరీశ్‌రావు తమ పాలనలో చేపట్టిన ప్రాజెక్టులపై కాంగ్రెస్ పార్టీ రాజకీయపరమైన దుర్బు ద్ధితో ఎంపీ ఎన్నికల్లో లబ్ధిపొందడమే లక్ష్యంగా తప్పుడు ప్రచారాలు చేస్తోందంటూ మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే కేవలం మేడిగడ్డ బ్యారేజీ ఒక్కటే కాదని.. వంద కాంపోనెంట్ల సమాహారమని, ఇదో బృహత్తరమైన ప్రాజెక్టు అని పేర్కొన్నారు. మూడు బ్యారేజీలు, 15రిజర్వాయర్లు, 19సబ్‌స్టేషన్లు, 21పంప్‌హౌజ్‌లు, 203కిలోమీటర్ల నిడివలో సొరంగాలు, 1531మీటర్ల మేర గ్రావిటీ కాలువలు, 98కిలోమీటర్ల మేర ప్రెజర్ మెయిన్స్, 141టీఎంసీల కెపాసిటీతో రిజర్వాయర్లు, 530మీటర్ల ఎత్తుకు నీటిని పంపింగ్ చేయడం లాంటి కాంపోనెంట్ల ద్వారా మొత్తం 240టీఎంసీల నీటిని వినియోగించుకునే లక్ష్యంతో కాళేశ్వరం ప్రాజెక్టును రీడిజైన్ చేసి నిర్మించినట్లు చెప్పుకొచ్చారు. అయితే కాంగ్రెస్ నేతలు ప్రాజెక్టులో దెబ్బతిన్న పిల్లర్లను మరమ్మతు చేయాల్సింది పోయి రాజకీయ దురుద్దేశాలతో దుష్ప్రచారం తో చేస్తూ ప్రాజెక్టును నిర్వీ ర్యం చేయడం ద్వారా రైతుల ప్రయోజనాలను దెబ్బతీసేందుకు కుట్ర చేస్తున్నారంటూ విరుచుకుపడ్డారు. చరిత్రలో అతి తక్కువ అంచనాలతో నిర్మాణం పూర్తయిన ఏకైక ప్రాజెక్టు కాళేశ్వరమేనని గణాంకాలు వెల్లడించారు. అలాగే కేటీఆర్ మాట్లాడు తూ ప్రాజెక్టుపై విచారణ నిర్వహించి అవసరమైతే బాధ్యులపై చర్యలు తీసు కోవాలని శాసనసభ వేదికగా తాము ఇప్పటికే తే ల్చిచెప్పామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లా కం కారణంగా కరీంనగర్‌లో పంటలు ఎండిపోతు న్నాయన్నారు. ఇప్పటికైన యుద్ధప్రాతి పాదికన చ ర్యలు చేపట్టి వరదలు వచ్చేలోపు ప్రాజెక్టును పున రుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, పద్మదేవేందర్‌రెడ్డి,

మిగతా 7వ పేజీలో..

ఫిబ్రవరిలో 92 శాతం బొగ్గు ఉత్పత్తి

రూ. 403 కోట్ల నష్టాల్లో భూపాలపల్లి ఏరియా

సింగరేణి ఇన్‌చార్జ్ జీఎం వెంకటయ్య


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి జీఎం వెంకటయ్య

కాకతీయఖని, మార్చి 1: సింగరేణి భూపాలపల్లి ఏరియా ఫిబ్రవరిలో 92 శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించిందని ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ వెంకటయ్య అన్నారు. ఏరియా జీఎం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన 11 నెలల్లో 30.95 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించామన్నారు. మార్చి ముగిసే సమయానికి మొత్తంగా 35.5 లక్షల టన్నుల ఉత్పత్తిని సాధించేందుకు కృషి చేస్తున్నామన్నారు. 2023-24 వార్షిక సంవత్సరంలో ఏరియాకు 49.40 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సింగరేణి యాజమాన్యం నిర్దేశించిందని తెలిపారు. అండర్‌గ్రౌండ్ గనుల్లో ఇసుక, బాటం యాష్, రివర్స్ సాండ్ తదితర సమస్యలతో బొగ్గు ఉత్పత్తి అనుకున్న స్థాయిలో సాధించలేక పోయామన్నారు. త్వరలోనే అన్ని సమస్యలనూ అధిగమించి 2024-25 సంవత్సరంలో యాజమాన్యం ఇచ్చిన టార్గెట్‌ను చేరుకుంటామని అన్నారు. ప్రస్తుతం ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టుల ద్వారా అధిక బొగ్గు ఉత్పత్తిని సాధిస్తున్నామన్నారు. అండర్ గ్రౌండ్ గనుల్లో బొగ్గు ఉత్పత్తి అంతంత మాత్రంగానే వస్తోందని తెలిపారు. అండర్‌గ్రౌండ్ గనుల్లో బొగ్గు వెలికి తీస్తే వచ్చే ఖర్చు కన్నా అది అమ్మితే వచ్చే లాభాలు తక్కువగా ఉన్నాయన్నారు. అందువల్ల ప్రస్తుతం భూపాలపల్లి ఏరియా రూ.403 కోట్ల నష్టాల్లో నడుస్తోందన్నారు.

ఫిబ్రవరిలో ఏరియాలోని కేటీకే-1వ గనికి 25,000 టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించగా 14,227 టన్నులు సాధించినట్టు తెలిపారు. కేటీకే-5వ గనికి 31 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించగా 15,289 టన్నులు, కేటీకే-6వ గనికి 19 వేల టన్నుల లక్ష్యం ఉండగా 9,312 టన్నులు, కేటీకే-8వ గనికి 15 వేల టన్నుల బొగ్గు లక్ష్యాన్ని నిర్దేశించగా 12,715 టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించినట్టు వివరించారు. ఓపెన్ కాస్టు ప్రాజెక్ట్-2కు 1,40,000 టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించగా 1,80,685 టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించిందన్నారు. ఓసీ-3కి 1,90,000 టన్నుల బొగ్గు లక్ష్యం ఉండగా 1,76,350 టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించినట్టు తెలిపారు. మొత్తంగా ఏరియా ఫిబ్రవరిలో 92 శాతం బొగ్గు ఉత్పత్తిని సింగరేణి భూపాలపల్లి ఏరియా సాధించిందన్నారు. నెల చివరికల్లా రోజుకు 16వేల టన్నుల చొప్పున బొగ్గు ఉత్పత్తిని సాధిస్తే నష్టాలను అధిగమించొచ్చని అన్నారు. అందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో అధికారులు జ్యోతి, సురేఖ, తుకారాం, శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి పీఏసీఎస్ వైస్ చైర్మన్, డైరెక్టర్


కాంగ్రెస్‌లో చేరిన వైస్ చైర్మన్, డైరెక్టర్‌ను అభినందిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

మల్హర్, మార్చి 1: తాడిచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకర సంఘం వైస్ చైర్మన్ సూర్య ప్రకాశ్‌రావు, డైరెక్టర్ సర్వినాయక్ కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్‌లో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో గురువారం రాత్రి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. వైస్ చైర్మన్ సూర్యప్రకాశ్‌రావు, డైరెక్టర్ సర్వినాయక్ బీఆర్‌ఎస్‌లో కొనసాగగా ఇద్దరు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో కాంగ్రెస్‌కు చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ల సంఖ్య ఏడుకు చేరింది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ఇప్ప మొండయ్య, వొన్న తిరుపతిరావు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పాటుపడాలి


పోలారంలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క

కొత్తగూడ, మార్చి 1: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులకు, ప్రజలకు ఫ్రెండ్లీ ప్రభుత్వమని.. ప్రజా సంక్షేమానికి విరుద్ధంగా విధులు నిర్వర్తిస్తే క్షమించమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. అధికారులు దుమ్మా కొట్టకుండా మండలాల అభివృద్ధికి కృషి చేయాలని, వారం లేదా 15 రోజుల కోసారి జిల్లా స్థాయి అధికారులు మండలాల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. కొత్తగూడలోని రైతు వేదికలో శుక్రవారం ఏర్పాటు చేసిన రివ్యూ సమావేశంలో అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. మండలాల్లో అభివృద్ధికి అధికారులు కృషి చేయాలన్నారు. మండల అభివృద్ధికి కావాల్సిన ప్రణాళికలను రుపొందించాలన్నారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గంగారం, కొత్తగూడ మండలాలు వెనుకబడినవని తెలిపారు. రెండు మండలాల ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండి సకాలంలో సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అర్హులైన వారికి అందించాలన్నారు ఏజెన్సీ వాసుల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చిన, సమస్యలను పరిష్కరించిన హైమండ్ ఆర్ఫ్, శంకరన్, శర్మ వంటి అధికారుల వలే పనిచేయాలని సూచించారు. గత ప్రభుత్వంలో నిధులు రాకపోవటంతో పనులు చేయలేదన్నారు. నేడు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రావడంతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వర్గం రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో నాలుగు అమలు చేశామన్నారు. 30 ఏళ్ల నుంచి కొత్తగూడ, గంగారం మండలాల్లోని గ్రామాలను చూస్తున్నానని పేర్కొన్నారు. రోడ్లు లేక ప్రజలు పడే ఇబ్బందులను చూశానన్నారు. నేడు పంచాయతీరాజ్ శాఖ మంత్రి పదవి రావడంతో ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు వేయిస్తున్నామన్నారు. కొత్తగూడ, పోలారం గ్రామాల్లో సీసీ రోడ్లకు, కొత్తగూడలో యువజన సంఘం భవనానికి మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు.

కార్యక్రమంలో ఎంపీపీ బానోత్ విజయ రూప్‌సింగ్, జడ్పీటీసీ పుల్సం పుష్పలత శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఈఈ సురేష్, విద్యుత్ శాఖ ఎస్‌ఈ నరేష్, డిప్యూటీ సీఈవో నర్మద, పంచాయతీ అధికారి హరిప్రసాద్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ చల్లా నారాయణరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరబోయిన మొగిలి, సర్పంచ్‌లు మల్లెల రణధీర్, వజ్జ వెంకటలక్ష్మి సురేందర్ పాల్గొన్నారు.

నేడు శ్రీపాదరావు జయంతి

అధికారికంగా నిర్వహించనున్న ప్రభుత్వం


కాటారం మండల పరిషత్ కార్యాలయంలో శ్రీపాదరావు విగ్రహం

కాటారం, మార్చి 1: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శాసన సభ స్పీకర్‌గా పనిచేసిన దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి శనివారం జరగనుంది. మార్చి 2న అధికారికంగా శ్రీపాదరావు జయంతి కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. దీంతో అధికార యంత్రాంగం అందుకు సన్నద్ధమైంది. కాటారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శ్రీపాదరావు విగ్రహం వద్ద వేడుకలు నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. విగ్రహం చుట్టూ గ్రీనరీ చేయించారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తండ్రి అయిన శ్రీపాదరావు జయంతిని అధికారికంగా నిర్వహించనుం డటంపై కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

చింతకాని క్రాస్, బస్వాపూర్ వద్ద శ్రీపాదరావు విగ్రహాల వద్ద జయంతి వేడుకల్లో కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చీమల సందీప్, మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరి కోరారు.

ఇంటర్ పరీక్షకు 90 మంది గైర్హాజరు


చిట్యాలలోని పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు

భూపాలపల్లిటౌన్, మార్చి 1: ఇంటర్మీడియట్ పరీక్షకు శుక్రవారం 90 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు నోడల్ అధికారి దేవరాజన్ తెలిపారు. ప్రథమ సంవత్సరం విద్యార్థు లకు అంగ్లం-1 పరీక్ష జరుగగా ఎనిమిది కేంద్రాల్లో 1,807 మంది విద్యార్థులకు 1,717 మంది మాత్రమే హాజరైనట్లు తెలిపారు. పరీక్షల సందర్భంగా జిల్లాలోని పలు కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. చిట్యాల మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్ కళాశాలల్లో పరిశీలించి ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మాల్ ప్రాక్టీస్‌కు తావు లేకుండా చర్యలు చేపట్టామని నోడల్ అధికారి దేవరాజన్ తెలిపారు.

ప్రజాపాలన హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయాలి


సీఎస్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ భవేశ్ మిశ్రా

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

కాకతీయఖని, మార్చి 1: ప్రజాపాలన హెల్ప్‌డెస్కులను ఎంపీడీవో, మునిసిపల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతి కుమారి అన్నారు. శుక్రవారం ఆమె హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా భూపాలపల్లి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ భవేష్ మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలకు అర్హులైన వారిని గుర్తించడంలో ప్రజాపాలన సేవా కేంద్రాలు కీలకంగా మారాయన్నారు. దరఖాస్తుదారుల ఆధార్, రేషన్‌కార్డు, గ్యాస్ కనెక్షన్, విద్యుత్ సర్వీసు నంబర్లలో తప్పులు దొర్లితే సరిచూసుకోవడానికి ప్రజాపాలన సేవా కేంద్రాలు దోహదపడతాయని అన్నారు. అలాగే ఇంటర్, టెన్త్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో సెల్‌ఫోన్స్, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించొద్దన్నారు. గత అనభవాలను దృష్టిలో ఉంచుకొని పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాల న్నారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకునేలా ఆయా రూట్లలో అదనపు బస్సు సర్వీసులను ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు.

ఈ సమావేశంలో భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ నరేష్, జడ్పీ సీఈవో విజయలక్ష్మి, అధికారులు దేవరాజం, నరేష్, నారాయణరావు, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శిశు మరణాల నియంత్రణే లక్ష్యం

ములుగు డీఎంహెచ్‌వో అప్పయ్య


గొత్తికోయగూడెంలో ఇంటింటి వివరాలు సేకరిస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

వెంకటాపూర్(రామప్ప), మార్చి 1: శిశు మరణాలను తగ్గించడమే లక్ష్యమని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ అల్లెం అప్పయ్య అన్నారు. మండల కేంద్రం శివారు అటవీప్రాంతంలో నివాసం ఉంటున్న రోలుబండ గొత్తికోయగూడాన్ని శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి సందర్శించారు. ఇందుకు ట్రాక్టర్‌లో పది కిలోమీటర్లు ప్రయాణించారు. గొత్తికోయగూడెంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసి 25 కుటుంబాల్లోని 90 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఇంటింటికి తిరిగి గ్రామస్థుల ఆరోగ్య పరిస్థితి వివరాలను స్వయంగా డీఎంహెచ్‌వో సేకరించారు. ములుగు జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో 61 గొత్తికోయగూడాలు ఉన్నాయన్నారు. వాటిలో 15 గొత్తికోయగూడాలకు రవాణా సౌకర్యం లేదన్నారు. గొత్తికోయలకు వైద్యం అందించడానికి సిబ్బంది అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని తెలిపారు. కిష్టపరిస్థితుల్లో గొత్తికోయ లకు వైద్యం అందించాలంటే ఎన్నో అవరోధాలు ఎదురవుతున్నాయని, అయినా సిబ్బంది తమ విధులను సమర్థంగా నిర్వర్తిస్తున్నారని అన్నారు. గొత్తికోయలు రహదారులకు సమీపంలో ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటే వారికి వైద్య సౌక ర్యం అందుబాటులోకి వస్తుందన్నారు. అనంతరం గొత్తికోయలకు పౌష్టికాహారం, విద్యాభ్యాసం, వైద్య సౌకర్యంపై అవగాహన కల్పించారు. రోలుబండ గొత్తికోయలకు ప్రతినెలా వైద్యపరీక్షలు నిర్వహించాలని స్థానిక వైద్యాధికారితోపాటు సిబ్బందిని డీఎంహెచ్‌వో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి శ్రీకాంత్, సీహెచ్‌వో సదానందం, ఏఎన్ఎంలు స్వప్న, కనకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ధ్యేయం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ, మార్చి 1: బడుగు బలహీన వర్గాలు, పేదల అభ్యున్నతే ధ్యేయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలో ఆయన శుక్రవారం పర్యటించారు. రైతువేదికలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ చేశారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాల్లో రెండింటిని అధికారంలోకి రాగానే అమలు చేశామన్నారు. ఉచిత విద్యుత్, రూ. 500కే గ్యాస్ సిలిండర్ పథకాలను కూడా ప్రారంభించామన్నారు. ఆర్థిక వెసులుబాటును చూసి మహిళలకు రూ. 2,500 కూడా అందజేస్తామన్నారు. గూడెపల్లి, గోరికొత్తపల్లి గ్రామాల్లో అసైన్డ్ భూములకు పట్టా పాస్‌బుక్కులు పంపిణీ చేశామని అన్నారు. అవినీతి రహిత పాలన అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణస్వామి, ఎంపీపీ పున్నం లక్ష్మి, ఎంపీటీసీలు, నాయకులు ఇప్పకాయల నర్సన్న, మేకల భిక్షపతి, కొలెపాక సాంబయ్య, పట్టెం శంకర్, రవిసామ్రాట్, మొట్టె కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

జడ్పీ వ్యవస్థ నిర్వీర్యం

నిధుల మంజూరులో కోత ● అరకొర నిధులతో పనులు చేయని దుస్థితి
కార్యాలయ నిర్వహణకు డబ్బులు కరువు ● ఉత్సవ విగ్రహాలుగా జడ్పీటీసీలు

హనుమకొండ టౌన్, మార్చి 1: గత పాలకులు జడ్పీ సెక్టార్‌ను నిర్వీ ర్యం చేశారు. మినీ అసెంబ్లీగా పిలవబడే జడ్పీ సెక్టార్‌కు నిధుల మంజూరులో కోత విధించారు. పలు గ్రాంట్లను నిలిపివేసి అరకొర నిధులు మంజూరు చేసి చేతులు దులుపుకున్నారు. అభివృద్ధి పనులు దేవుడెరుగు కనీసం చాయి, బిస్కెట్లకు నిధులు లేని దుస్థితి జడ్పీ సెక్టార్‌లో నెలకొంది. ప్రత్యక్ష ఎన్నికల్లో విజయం సాధించి ఉత్సాహంగా జడ్పీలో అడుగుపెట్టిన జడ్పీటీసీలు ఉత్సవ విగ్రహాలుగా మారారు. కేవలం మీటింగ్‌లకు రావడం, వారు కొనసాగుతున్న పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనడం మినహా వారు చేసే ఘనకార్యం ఏమిలేదు. మరో నాలుగుమాసాల్లో పదవీకాలం పూర్తి కావస్తుండగా గెలిపించిన ప్రజల కోసం పైసా పని చేయలేని పరిస్థితి ఏర్పడింది. దీనితో జడ్పీటీసీలు ప్రజలకు ముఖం చాటేయాల్సిన పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుండటం గమనార్హం. నూతన ప్రభుత్వం ఈ పరిస్థితిని గమనించి జడ్పీలకు పూర్వవైభవం తీసుకురావాలని సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అరకొర నిధులు మంజూరు

జడ్పీ సెక్టార్‌లకు గత పాలకులు అరకొర నిధులు మంజూరు చేశారు. 2019 జూలై మొదటి వారంలో జడ్పీ పాలకవర్గాలు కొలువుదీరాయి. ఈ ఐదేళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కేవలం రూ.5కోట్ల 83లక్షల 22వేల నిధులు మంజూరయ్యాయి. వీటిలో కేంద్రం మంజూరు చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2కోట్ల 78లక్షల 39వేలు కాగా, రాష్ట్రం స్పెషల్ గ్రాంట్ క్రింద మంజూరు చేసిన నిధులు రూ.3కోట్ల 48లక్షలు. ఈనిధులు జిల్లాలోని ఏడుగురు జడ్పీటీసీలు, ఇద్దరు కోప్షన్ సభ్యులకు కేటాయిస్తారు. కాగా, వచ్చిన నిధులు 60:40 రేషియోలో పంపకాలు జరుపుకున్నట్లు సమాచారం. 60శాతం 8మంది సభ్యులకు 40శాతం చైర్మన్ కోటా కింద కేటాయింపులు జరుపుకున్నట్లు తెలిసింది. చైర్మన్‌కు కేటాయించిన అదనపు నిధులు అత్యవసరమైన చోట వెచ్చించేందుకు వినియోగిస్తున్నట్లు సమాచారం. ఈ లెక్కన ప్రతి జడ్పీటీసీకి వచ్చిన గ్రాంట్ కేవలం రూ.60 లక్షలు మించలేదు. ప్రతీ జడ్పీటీసీ పరిధిలో 20కి పైగా గ్రామాలుంటాయి. వచ్చిన గ్రాంట్ సమానంగా పంపకాలు జరిపితే ప్రతీ గ్రామానికి రూ.3లక్షల నిధులు మాత్రమే వస్తాయి. అరకొర నిధులతో ఎలాంటి పనిచేయలేని జడ్పీటీసీలు ఒకటిరెండు గ్రామాలు ఎంపిక చేసుకుని అందుబాటులో నిధులమేరకు అభివృద్ధి పనులు చేశారు. మిగతా గ్రామాలను గాలికి వదిలేసారు.

చాయ్, బిస్కెట్లకు డబ్బులు లేవు

పాలకులు జడ్పీ సెక్టార్‌లకు నిధులు మంజూరు చేయకపోవడంతో కనీస సౌకర్యాలకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. జడ్పీలకు మంజూరయ్యే నిధుల నుంచి 5శాతం నిధులు పరిపాలన సంబంధ ఖర్చులకు వెచ్చిస్తున్నారు. సమావేశాలు జరిగినప్పుడు చాయ్, బిస్కెట్లు, స్టేషనరీ, స్వీపర్లకు వేతనాలకు, కరెంటు బిల్లులు చెల్లిస్తున్నారు. నిధుల మంజూరులో కోత ఏర్పడటంతో యేడాదిగా కరెంటు బిల్లులు చెల్లించడం లేదు. దినసరి ఉద్యోగులకు రెండు మూడు నెలలకు వేతనాలు ఇస్తున్నారు. జడ్పీ కార్యాలయం మెయిన్ రోడ్డు ఆరు కమర్షియల్ కాంప్లెక్స్ ఉండటం, వాటి అద్దెలతో ఖర్చులు కానిస్తున్నారు. మొత్తంగా గతపాలకుల వైఖరితో మినీ అసెంబ్లీగా పిలువబడే జడ్పీ సెక్టార్‌లు ఉనికిని కోల్పోయే దుస్థితి నెలకొనడం విశేషం.

మంజూరైన నిధులు ఇలా..

15వ ఆర్థిక సంఘం నిధులు: 2020-21 సంవత్సరానికి గాను రూ.57,87,000

2021-22 సంవత్సరానికి గాను రూ.93,80,464

2022-23 సంవత్సరానికి గాను రూ.97,24,102

2023-24 సంవత్సరానికి గాను రూ.29,47,730

స్పెషల్ గ్రాంట్: 2021 సంవత్సరానికి గాను రూ.1,73,00,663

స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్: 2022-23 సంవత్సరానికి గాను రూ.1,31,82,907..


అల్లంత దూరం నుంచి పక్షులను చూడడం, చెట్లపై వాలిన వాటి అందాలను దూరంగా గమనించడం సహజం. అవే పక్షులను దగ్గరగా చూస్తే? వాటి ఆహారం, ఆహార్యం, అలవాట్లను తెలుసుకోగలిగితే..? చింత రావి, తుమ్మ, గంధ్ర వెదురు చెట్లపై వాలే ఈ అతిథి విహంగ జీవన క్రమాన్ని అర్థం చేసుకోగలిగితే.. ఎంత బాగుంటోదో కదా.. ఈ సరదా తీరాలంటే వరంగల్‌లోని అమ్మవారిపేట చెరువు వద్దకు వెళితే సరి. ఆహారం, అన్వేషణ, అవాసాలపై జీవించే క్రమంలో ఆయా పక్షుల ప్రత్యేకతను వివరంగా తెలుసుకునే అవకాశం ఈ చెరువు వద్ద కనిపిస్తుంది. పక్షులు కిలకిలరావాలు చెవులకు ఇంపుగా వినిపిస్తాయి. మనసుకు ఆహ్లాదాన్ని కలిగిస్తాయి.



అరుదైన పక్షుల ఆలవాలం



కామన్ పెరియా



గ్రీన్ బీటర్



ఎల్లో వ్యాగ్‌టెయిల్

- వివిధ దేశాల నుంచి వలస వస్తున్న అనేక పక్షులు
- అమ్మవారిపేట చెరువు వద్ద పక్షుల విడిదిగా అనువైన వాతావరణం
- పక్షుల సంరక్షణ కేంద్రంగా చేయాలని ప్రకృతిప్రేమికుల డిమాండ్

హనుమకొండ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): వరంగల్ నగర శివార్లలోని అమ్మవారిపేట ప్రకృతి రమణీయతకు ప్రతీక. చెరువుకు రెండు వైపుల గుట్టలు. మరో వైపు పొలాలు, ఇంకో వైపు నిండుగా నీళ్లతో చెరువు. దాని ఆవరించిన కట్ట. ఎటుచూసినా పచ్చని చెట్లు. నిశ్శబ్దమైన వాతావరణం. చెట్లపై వివిధ రకాల అరుదైన పక్షుల కిలకిలలు, స్థానికంగా ఉండే పక్షులతోపాటు వివిధ దేశాల నుంచి వలస వచ్చిన పక్షలు ఇక్కడ విడిది చేసి ఉండడం కనిపిస్తుంది. సుమారు 100 రకాలు ఇక్కడ దర్శనమిస్తాయి. వీటిలో అత్యంత అరుదైన పక్షులు కూడా ఉన్నాయి. ఇటీవల జంతుశాస్త్ర ప్రొఫెసర్ డాక్టర్ జగన్ ఓ అరుదైన పక్షిని గుర్తించి ఫొటోలు తీశారు. ఇలాంటివే మరికొన్ని పక్షులు కూడా అక్కడ ఉన్నాయి. సాధారణంగా ఆయా కాలాల్లో వివిధ ప్రాంతాల నుంచి పక్షులు గుడ్లను పొదగడం కోసం అనువైన ప్రాంతాలను వెతుక్కుంటూ వలస వెళుతుంటాయి. అలాంటి ప్రాంతమే అమ్మవారిపేట చెరువు. పచ్చని చెట్లు, మనుసుకు హాయినిచ్చే ప్రశాంతతకు పెట్టింది పేరు ఈ చెరువు. అనువైన వాతావరణం ఉండడంతో అనేక పక్షులు ఇక్కడికి పెద్దఎత్తున వలస వస్తున్నాయి.

అరుదైన పక్షి

ఇటీవల అత్యంత అరుదైన పక్షి స్పర్ వింగ్డ్-లాప్ వింగ్ అనే పక్షి అమ్మవారిపేట చెరువు వద్ద కంటపడింది. దేశంలో మొట్టమొదటి సారి ఇక్కడే కనిపించడం విశేషం. ఈపక్షి స్వస్థలం ఉత్తర ఆఫ్రికా, మిడిల్ ఈస్ట్, మధ్యదరా ప్రాంతాలు. సాధారణగా ఏ పక్షి రెక్కలకు గోళ్లు ఉండవు. కానీ అరుదైన పక్షి రెక్కలకు గోళ్లు ఉన్నాయి. చిన్నగా, పొట్టిగా ఉండి చూడడానికి చాలా అందంగా కనిపిస్తుంది. ఈ పక్షిని మొట్టమొదటిసారిగా హనుమకొండకు చెందిన జువాలజీ ప్రొఫెసర్ డాక్టర్ జగన్ గుర్తించారు. పక్షి ఫొటోలను తీశారు. ఇలాంటివే మరికొన్ని పక్షులు కూడా ఇక్కడ సంచరిస్తున్నాయి. ఆయన వాటిని కూడా గుర్తించే ప్రయత్నంలో ఉన్నారు. దీనిని బట్టి సుదూర దేశాల నుంచి పక్షులు ఈ చెరువు వద్దకు వలస వస్తున్నట్టు స్పష్టమవుతోంది.

వంద రకాల పక్షులు

అమ్మవారిపేట చెరువు వద్ద 100 రకాల పక్షులు సంచరిస్తున్నాయి. వీటిలో స్థానికంగా కనిపించే పక్షులతో పాటు ఇతర దేశాలకు చెందిన అరుదైన, అందమైన పక్షులు కూడా ఉన్నాయి. వేర్ టేయిల్డ్ స్వాలో, బ్లూటేల్డ్ బీ ఈటర్, యూరోసియన్ వేగన్, కామన్ వ్యాగ్ టేయిల్, విష్పర్డ్ టెర్న్, బ్లాక్ వింగ్డ్ స్టిల్ట్, వైట్ త్రోటెడ్ కింగ్ ఫిషర్, ఎల్లో రాటిల్డ్ లాప్వింగ్, ఎల్లో వ్యాగ్‌టేల్, ఇంటర్మీడియట్ ఎగ్రెట్, స్పాట్ బిల్ డక్, కామన్ డ్రాంగో, కామన్ గ్రైనియా, సాండ్ పైపర్, డార్టర్ ద స్నేక్ బర్డ్, గ్రే హేరాన్, గ్రీన్ బీ ఈటర్, ఫ్రింగ్డ్ ఊలీడక్స్, నాబ్ బిల్డ్ డక్స్, బిన్ టెల్, గార్గని, యురేపియన్ బీగన్, టఫెడ్ డక్స్, తదితర పక్షులు వీటిలో ఉన్నాయి. కామన్ కింగ్ ఫిషర్, రీడ్ వెబ్లెర్, సిల్వర్ బిల్, ఫెల్‌వోస్ విజిలింగ్ డక్స్ వంటి పక్షులు కూడా వీటిలో ఉన్నాయి.

పక్షుల సంరక్షణ కేంద్రం

తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అమ్మవారిపేట చెరువు వద్ద అనేక రకాల పక్షులు విడిది చేస్తున్నందువల్ల ఈ చెరువును పక్షుల సంరక్షణ కేంద్రంగా మార్చాలని స్థానికులు, పక్షి ప్రేమికులు కోరుతున్నారు. హైదరాబాద్‌లోని అమీన్‌పూర్ చెరువు తర్వాత అత్యధిక సంఖ్యలో వివిధ రకాల పక్షులకు కేంద్రంగా ఉన్న అమ్మవారి పేట చెరువును పక్షుల సంరక్షణ కేంద్రంగా ప్రకటించినట్లయితే మరిన్ని ఎక్కువ పక్షులు ఇక్కడి వచ్చే అవకాశం ఉందని వారు భావిస్తున్నారు. వాస్తవానికి వరంగల్ నగరం, దాని చుట్టు పక్కల ప్రాంతాల్లో పలుచెరువు ఉన్నాయి. ఈ చెరువుల వద్ద కూడా అనేక రకాల పక్షులు మనకు తారసడతాయి. అయితే కబ్జాల కారణంగా ఈ చెరువులన్నీ క్రమంగా కనుమరుగవుతున్నాయి. దీనితో వరంగల్‌లో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది. పక్షులన్నీ ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నాయి. అలా కాకుండా కనీసం అమ్మవారి చెరువునా కాపాడానలి ప్రజలు కోరుతున్నారు.

పక్షి ప్రేమికుడు డాక్టర్ జగన్

డాక్టర్ జగన్ పక్షి ప్రేమికుడు. ఏళ్లతరబడి పక్షులపై ఆయన అధ్యయనం చేస్తున్నారు. ఇప్పటికే ఆయన వందర రకాల పక్షులపై లోతైన అధ్యయనం చేశారు. వాటి ఫోటోలను తీసి అల్బమ్‌గా తీసుకువచ్చారు. అమ్మవారిపేట చెరువు వద్ద అరుదైన స్పర్డ్ వింగ్‌డ్-ల్యాప్ వింగ్ పక్షిని మొట్టమొదటి సారి గుర్తించింది ఆయనే. జనగామ జిల్లా పాలకుర్తి మండలం ముత్తారం గ్రామానికి చెందిన డాక్టర్ జగన్ 2005నుంచి పక్షలపై అధ్యయనం చేస్తున్నారు. ఉద్యోగరిత్యా హైదరాబాద్‌లో ఉన్నప్పుడు అమీన్‌పూర్ చెరువు, దానిచుట్టుపక్కల ఉన్న పలు అరుదైన పక్షలను గుర్తించారు. వరంగల్ దాని చుట్టుపక్కల ఉన్న చెరువుల వద్ద అనేక రకాల పక్షలు కనిపిస్తాయని అంటున్న ఆయన చెరువులు అంతరించిపోతుండడం వల్ల ఈ పక్షుల ఉనికి ప్రమాదంలో పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఇంటర్మీడియట్ ఎగ్రేట్



సాండ్ పైపర్



డార్టర్ ది స్నేక్ బర్డ్



గ్రే హెరాన్



కామన్ డ్రాగన్



స్పాట్ బిల్ డక్

నకిలీ సెఫిక్సిన్ విక్రయించొద్దు..

హనుమకొండ, మార్చి 1: నకిలీ సెఫిక్సిన్‌ను మార్కెట్‌లో విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హనుమకొండ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జన్ను కిరణ్ కుమార్ హెచ్చరించారు. హైదరాబాద్‌లో నకిలీవిక్రయాలపై ఔషధ నియంత్రణ శాఖ డైరెక్టర్ జనరల్ కమల్‌హాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఔషధ నియంత్రణ శాఖ టాస్క్‌ఫోర్స్ బృందం విచారణ చేపట్టిందన్నారు. హైదరాబాద్‌లో ఈ నకిలీ మందు విక్రయాలు జోరుగా సాగుతున్నాయని, పసిగట్టి దాడులు చేపట్టామన్నారు. వీటి మూలాలు ఉత్తరాఖండ్‌లో ఉన్నట్లు గుర్తించి అక్కడడకు వెళ్లి స్థానిక పోలీసుల సహకారంతో వారిని అరెస్టు కూడా చేశామన్నారు. హనుమకొండలో ఇలాంటి నకిలీ విక్ర యాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పది మందికి జరిమానా

హనుమకొండ క్రైం, మార్చి 1: డ్రంకెన్ డ్రైవ్‌లో పది మందికి జరిమానా విధిస్తూ వరంగల్ జిల్లా న్యాయస్థానం శుక్రవారం తీర్పు వెల్లడించింది. హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సీతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కేయూ జంక్షన్, పెద్దమ్మగడ్డ, నయీంనగర్, యాదవనగర్‌లో గురువారం రాత్రి పది మందిని అదుపులోకి తీసుకుని బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించగా మద్యం సేవించినట్టు గుర్తించారు. వారికి శుక్రవారం కోర్టుకు తరలించగా న్యాయమూర్తి రమేష్ పది మందికి రూ.10,700 జరిమానా విధించారు. అదే విధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 7 గురు వ్యక్తులకు రూ.7,900 జరిమాన విధించినట్టు సీతారెడ్డి తెలిపారు.

వలంటీర్ల ఎంపిక

హనుమకొండ క్రైం, మార్చి 1: అగ్నిమాపక శాఖకు అనుబంధంగా ప్రకృతి వైపరిత్యాలు సంభవించిన సమయంలో స్వచ్ఛందంగా పని చేసేందుకు వలంటీర్లను ఎంపిక చేస్తున్నట్టు అగ్నిమాపక శాఖ ఉమ్మడి వరంగల్ జిల్లా డివిజన్ అధికాధి మామిడి భగవాన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు 'ఆపద మిత్రుడు - స్వచ్ఛంద సేవకుడు' కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లా నుంచి 200 మందిని, హనుమకొండ జిల్లా నుంచి 300 మందిని ఎంపిక చేస్తామని వెల్లడించారు. ప్రకృతి వైపరిత్యాలైన అగ్నిప్రమాదాలు, భూకంపాలు, వరదలు, తుపాన్లు వచ్చిన ప్రాంతాల్లో స్వచ్ఛందంగా పని చేస్తూ ప్రజలకు సేవ చేయాలనే మానవత్వం ఉన్న వారికి అవకాశం కల్పిస్తామని తెలిపారు. రెండు జిల్లాల కలెక్టర్ల ఉత్తర్వుల మేరకు ఈనెల 4నుంచి ఎంపికల ప్రక్రియ జరుగుతుందని, 18 నుంచి 40 యేళ్లలోపు వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కనీసం 7వ తరగతి చదివి సేవాభావం కలిగి ఉన్న వారు అర్హులని వెల్లడించారు. ఎంపిక చేసిన వారికి 12 రోజుల ప్రత్యేక సామగ్రిని అప్పగించి శిక్షణ ఇస్తామని తెలిపారు. అన్ని అగ్నిమాపక కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని, పూర్తి వివరాలకు 87126 99149, 87126 99305 నెంబర్లలో సంప్రదించాలని భగవాన్‌రెడ్డి సూచించారు.

ఫోన్ లాక్కుని డబ్బు స్వాహా

హనుమకొండ క్రైం, మార్చి 1: బలవంతంగా ఫోన్ తీసుకుని ఫోన్‌లో నుంచి డబ్బులు కాజేసిన వ్యక్తిపై హనుమకొండ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన ఊకంటి శ్రీనాథ్‌రెడ్డి టైలర్‌స్ట్రీట్‌లో మెడికల్‌షాపులో పని చేస్తున్నాడు. హనుమకొండ సుధానగర్ ప్రాంతానికి చెందిన అనిపర్తి అనితకుమార్ అనే వ్యక్తి కొద్ది రోజుల కిందట పరిచయమయ్యాడు. కిందటేడు ఆగస్టు 28న శ్రీనాథ్‌రెడ్డి పనిచేస్తున్న మెడికల్ షాపునకు అనితకుమార్ వచ్చాడు. ఫోన్ మాట్లాడేది ఉంది, ఫోన్ ఇవ్వాలని కోరాడు. ఫోన్ ఇవ్వడానికి నిరాకరించడంతో బలవంతంగా ఫోన్‌ను లాక్కుని ఓ లోన్ యాప్ ద్వారా రూ.2.30లక్షలు అనిత్‌కమార్ ఫోన్‌పేకు పంపించుకున్నాడు. డబ్బుల గురించి ప్రశ్నించగా ఇస్తానని జరుపుకుంటూ వచ్చి చివరికి ఇవ్వను ఏం చేసుకుంటావో చేసుకో అని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో బాధితుడు శ్రీనాథ్‌రెడ్డి హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో.. పంటలు ఎండుతున్నాయి



టోల్‌గేట్ వద్ద బీఆర్‌ఎస్ నాయకుల కాన్వాయ్‌ని అడ్డుకున్న కాంగ్రెస్ శ్రేణులు

(5వ పేజీ తరువాయి)

రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మీ, జడ్పీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సమన్వయలోపంతో ఉద్రిక్తత

బీఆర్‌ఎస్ చలో మేడిగడ్డ కార్యక్రమ నేపథ్యంలో పోలీసుల సమన్వయలోపం స్పష్టంగా కనిపించింది. తొలుత బ్యారేజీ చెక్‌పోస్ట్ వద్ద బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలను లోనికి అనుమతించిన పోలీసులు కేటీఆర్ పర్యటనకు కొద్ది నిమిషాల ముందు కట్టడి చర్యలు ప్రారంభించారు. అప్పటికే వంతెన సమీపంలోకి చేరుకున్న కార్యకర్తలను పోలీసులు ఆపేందుకు ప్రయత్నించినా వారంతా వంతెన గేటు వద్దకు చేరుకోవడంతో పోలీసులు వంతెన గేటు మూసివేశారు. దీంతో పోలీసులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలకు మధ్య సుమారు అరగంటపాటు వాగ్వాదం జరిగింది. కానీ అక్కడ సరిపడా పోలీసు సిబ్బంది లేకపోవడంతో.. కార్యకర్తలంతా ఒక్కసారిగా గేటును తోసేసి లోనికి దూసుకురావడంతో స్వల్ప తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో పలువురు మహిళ కార్యకర్తలు, నాయకులు, పోలీసులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనకు ముందు ఓడీ ఎస్పీ స్థాయి అధికారి మీడియాకు అనుమతి ఉందని లోపలికి పంపగా.. మరో డీఎస్పీ స్థాయి అధికారి అడ్డుకోవడం వాగ్వాదానికి దారితీసింది. పోలీసుల సమన్వయలోపాన్ని బయటపెట్టింది. ఇక పోలీసులు అత్యుత్సాహం కారణంగా కేటీఆర్‌తో కలిసి పరిశీలనకు వెళ్లాల్సిన మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రా రెడ్డి, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మదేవేందర్‌రెడ్డిపాటు ఎంపీ మాలోత్ కవిత, జడ్పీ చైర్మన్ గండ్ర జ్యోతి సహా పలువురు నేతలు ప్రత్యేక వాహనాల్లో కాకుండా నడుచుకుంటూ కుంగిన ప్రాంతానికి వెళ్లారు. మూడు రోజుల ముందే పర్యటనకు సంబంధించిన సమాచారం ఉన్నా ఆస్థాయిలో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేయలేదన్న విమర్శలు వినిపించాయి.

ఉద్రిక్తత.. ఉద్విగ్నంగా..

బీఆర్‌ఎస్ చేపట్టిన చలో మేడిగడ్డ కార్యక్రమం ఉద్రిక్తతగా సాగింది. శుక్రవారం ఉదయం హైదరాబాద్ తెలంగాణ భవన్ నుంచి రెండు బస్సులతో పాటు కాన్వాయ్‌లో వచ్చిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రులు, హరీష్‌రావు, నిరంజన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, మల్లారెడ్డి, మాజీస్పీకర్లు పోచారం శ్రీనివాస్ రెడ్డి, మదుసూధనచారి, పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల బృందానికి జనగామ జిల్లా పెంబర్తి వద్ద స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రులు ఎరబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్‌లతో పాటు పలువురు నాయకులు ఘన స్వాగతం పలికారు. ఉదయం 11 గంటలకు పెంబర్తి నుంచి బయలుదేరిన బీఆర్‌ఎస్ నాయకులకు హసన్‌పర్తి మండలం దేవన్నపేట వద్ద కాంగ్రెస్ శ్రేణుల నుంచి నిరసన ఎదురైంది. 'గో బ్యాక్ బీఆర్‌ఎస్.. గో బ్యాగ్ కేటీఆర్' అంటూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నినాదాలు చేసి బీఆర్‌ఎస్ నేతల కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. దీంతో కొద్ది సేపు ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. ఆ తర్వాత పోలీసుల బందోబస్తు మధ్య కాన్వాయ్ ముందుకు సాగింది. దామెర క్రాస్ వద్ద ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పోలీసుల చేతిలో గాయపడి చికిత్స పొందుతున్న కార్యర్తలను కేటీఆర్ పరామర్శించారు. అక్కడి నుంచి భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయానికి చేరుకున్న కేటీఆర్ బృందం మధ్యాహ్నం భోజనం అనంతరం 3:30గంటలకు భూపాలపల్లికి బయలుదేరి 4:40కి మేడిగడ్డకు చేరుకున్నారు. అక్కడ పరిశీలన అనంతరం 5.20గంటలకు అన్నారం బ్యారేజీకి వెళ్లారు.

బీఆర్‌ఎస్ నాయకుల అత్యుత్సాహం

పిల్లర్ల పైకి ఎక్కి సెల్ఫీలు

మహదేవపూర్ రూరల్, మార్చి 1: మేడిగడ్డ బ్యారేజీ వద్ద పోలీసులు పట్టించుకోకపోవడంతో బీఆర్‌ఎస్ నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ప్రమాదకర ప్రదేశంలో సెల్ఫీలు దిగుతూ కనిపించారు. తొలుత మేడిగడ్డ బ్యారేజీ వంతెనపైకి అనుమతించని పోలీసులు ఆ తర్వాత కార్యకర్తలు నెట్టుకుంటూ రావడంతో వారిని వదిలేశారు. దీంతో బీఆర్‌ఎస్ నాయకులు బ్యారేజీ వంతెనపైనే కాకుండా పిల్లర్లపైకి ఎక్కి సెల్ఫీలు దిగారు. సాధారణంగా అధికారులకు మాత్రమే అనుమతి ఉన్నచోట హంగామా చేశారు. ఇంత జరుగుతున్నా పోలీసులు కనీసం హెచ్చరికలు కూడా జారీ చేయలేదు.



మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్‌పైకి ఎక్కి సెల్ఫీలు దిగుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

గెలుపే లక్ష్యంగా..

- కబడ్డీ పోటీలలో స్వర్ణ పతకమే లక్ష్యంగా కసరత్తు
- నేటి నుంచి నాగార్జుసాగర్‌లో రాష్ట్ర స్థాయి పోటీలు





జేఎన్‌ఎస్ కబడ్డీ కోర్టులో సాధన చేస్తున్న హనుమకొండ జిల్లా కబడ్డీ జట్టు క్రీడాకారులు

హనుమకొండ స్పోర్ట్స్, మార్చి 1: మార్చి 2 నుంచి 4 వరకు నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లో నిర్వహించనున్న 70వ అంతర్ రాష్ట్రాల సీనియర్ మెన్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో పాల్గొని స్వర్ణ పతకం సాధించి జిల్లాకు కీర్తి తీసుకరావడమే ధ్యేయంగా హనుమకొండ జిల్లా కబడ్డీ జట్టు క్రీడాకారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన జట్టు క్రీడాకారులు కొంత కాలంగా హనుమకొండ జేఎన్‌ఎస్‌లోని కబడ్డీ కోర్టులో డీఎస్‌ఏ తాత్కాలిక కోచ్ ఓనపాకల శంకర్ సారథ్యంలో ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో సాధన చేస్తున్నారు. డీఎస్‌ఏ కోచ్ శంకర్ సారథ్యంలో శిక్షణ పొందుతున్న జిల్లా జట్టు క్రీడాకారులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో సత్తా చాటి స్వర్ణ పతకం సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

కబడ్డీ అకాడమీ ఏర్పాటు చేయాలి..:

ఓనపాకల శంకర్, డీఎస్‌ఏ కబడ్డీ కోచ్

జేఎన్‌ఎస్‌లో కొన్ని క్రీడలకు మాత్రమే అకాడమీలు ఉన్నాయి. గ్రామీణ క్రీడగా ప్రసిద్ధిగాంచిన కబడ్డీ క్రీడాకారులు కోసం అకాడమీ ఏర్పాటు చేయడం ద్వారా మెరికలాంటి క్రీడాకారులను జిల్లాకు అందించవచ్చు. అకాడమీలు నెలకొల్పడం ద్వారా క్రీడాకారులకు మరిన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉండడంతో క్రీడల్లో మరింత నైపుణ్యం సాధించవచ్చు. అదే విధంగా కబడ్డీ క్రీడను ఒలంపిక్‌లో చేర్చడం ద్వారా క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ లభించే అవకాశం ఉంది. ప్రతీ రోజు సుమారు 30 మంది యువతకు కబడ్డీ క్రీడలో ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ అందిస్తున్న. ఇక్కడ నా వద్ద శిక్షణ పొందిన క్రీడాకారులు ఇప్పటికే పలు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి కబడ్డీ పోటీలో పాల్గొని ప్రతిభ కనబర్చి రాణిస్తున్నారు.

గ్రేట్ 'జాబ్'!

- అధ్యాపక, ఉపాధ్యాయ పోస్టుల్లో అరుదైన ఫలితాలు
- ఒక్కరికి పలు ఉద్యోగాలు

● ఒకే మహిళకు నాలుగు ఉద్యోగాలు



గట్ల పుష్పలత

కేసముద్రం, మార్చి 1 : కేసముద్రం స్టేషన్‌కు చెందిన గట్ల పుష్పలత తెలంగాణ గురుకుల విద్యాసంస్థల నియామక బోర్డు(ట్రిబ్) ఆధ్వర్యంలో నిర్వహించిన నియామక పరీక్షల్లో నాలుగు ఉద్యోగాలకు ఎంపిక కావడం విశేషం. ఈ నియామక పరీక్షల్లో డిగ్రీ, జూనియర్ లెక్చరర్, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ), ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ) పోస్టులకు ఆమె ఎంపికయ్యారు. కేసముద్రం స్టేషన్‌కు చెందిన స్థానిక జీజేసీ లెక్చరర్ కొత్తకొండ ప్రసాద్‌తో 2009లో వివాహం కాగా, అప్పటికే ఆమె బీఎస్సీ(బీజెడ్సీ), బీఈడీ పూర్తి చేశారు. వివాహం అనంతరం ఆమె భర్త ప్రోత్సాహంతో 2013లో ఎంఎస్సీ(బాటనీ), 2019లో ఎంఏ(తెలుగు) కేయూలో పూర్తిచేసి, జాతీయ అర్హత పరీక్ష(నెట్), రాష్ట్ర అర్హత పరీక్ష(సెట్) అర్హత సాధించారు. 2021లో నియామక పరీక్ష, డెమో, ఇంటర్వ్యూలో గెస్ట్ లెక్చరర్‌గా ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆమె వరంగల్ తూర్పు టీఎస్ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు గెస్ట్ లెక్చరర్‌గా పని చేస్తున్నారు. ఒకేసారి నాలుగు ఉద్యోగాలు సాధించడంతో గ్రామస్తులు పుష్పలతను అభినందించారు.

● అక్కా చెల్లెళ్లకు మూడేసి ఉద్యోగాలు



అక్కాచెల్లెళ్లు దివ్య, వకుల

బచ్చన్నపేట, మార్చి 1: వారిద్దరు అక్కాచెల్లెళ్లు.. పేదరైతు ఇంట్లో పుట్టిన బిడ్డలు. పెళ్లిళ్ల అయినప్పటికీ పట్టు వదలలేదు. మంచి ఉద్యోగం సంపాదించి చదివిన చదువుకు సార్థకత చేకూర్చాలనుకున్నారు. రాసిన మూడు పరీక్షల్లో ప్రతిభ కనబరిచి మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిని మండల ప్రజలు ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. బచ్చన్నపేట మండలం పడమటికేశ్వాపూర్ గ్రామానికి చెందిన నిమ్మ సక్కుబాయి ఈదిరెడ్డి దంపతులకు వకుల, దివ్య అనే ఇద్దరు కుమార్తెలు. చిన్నప్పటి నుంచి చదువులో ముందుండేవారు. పదోతరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యాభ్యాసం సాగింది. ఇంటర్, డిగ్రీ హైదరాబాద్‌లో, పీజీ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు. వకులను జగదేవ్‌పూర్ మండలం దౌలాపూర్‌కు చెందిన వంటేరు సంపత్‌రెడ్డికి, రెండో అమ్మాయి దివ్యను బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామానికి చెందిన ఉమ్మెంతల మధుసూదన్‌రెడ్డికిచ్చి వివాహం చేశారు. వకుల గృహిణిగా, దివ్య జనగామ మండలం వెంకిర్యాల పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ప్రభుత్వం ఆగస్టు 2023లో గురుకుల పాఠశాలల్లో ఉపాధ్యాయుల కోసం పరీక్షలు నిర్వహించగా, అక్కాచెల్లెళ్ల జనగామలో ఉంటూ ప్రిపేర్ అయ్యారు. ఫిబ్రవరి 14న పీజీటీ, 29న జూనియర్ లెక్చరర్, మార్చి 1న టీజీటీ ఫలితాలు వెల్లడయ్యాయి. ఈ మూడింటిలోనూ అక్కాచెల్లెళ్ల ఎంపికయ్యారు. దీంతో జూనియర్ లెక్చరర్ పోస్టుల్లో జాయిన్ అయ్యేందుకు వారు సిద్ధమయ్యారు. కాగా ఒక్క ఉద్యోగం పొందేందుకు నానా తంటాలు పడుతున్న ఈ రోజుల్లో అక్కాచెల్లెళ్ల మూడేసి ఉద్యోగాలకు ఎంపిక కావటంతో వారికి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. భవిష్యత్తులో మరిన్ని పోటీ పరీక్షలకు సిద్ధమవుతూనే ఉంటామని వారు ఆత్మస్థైర్యంతో చెబుతున్నారు.

● దంపతులకు రెండేసి ఉద్యోగాలు



గంధసిరి వెంకటేశ్వర్లు, గీత

కురవి, మార్చి 1: కురవి మండలం నేరడ గ్రామానికి చెందిన గంధసిరి వెంకటేశ్వర్లు-గీత దంపతులు ఇటీవల విడుదలైన ఉద్యోగ పరీక్షా ఫలితాల్లో రెండేసి ఉద్యోగాలు సాధించారు. గురుకుల ఫలితాల్లో గంధసిరి వెంకటేశ్వర్లు డిగ్రీ లెక్చరర్, జూనియర్ లెక్చరర్ పోస్టులకు ఎంపికయ్యారు. ఆయన భార్య గీత పీజీటీ, టీజీటీ పోస్టులకు ఎంపికయ్యారు. భార్యాభర్త రెండేసి పోస్టులకు ఎంపిక కావడం పట్ల మిత్రులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

● ఒకే వ్యక్తికి మూడు ఉద్యోగాలు

నడికూడ, మార్చి 1 : నడికూడ మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన దొంతుల కృష్ణమూర్తి పట్టుదలతో చదివి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. అయితే ఆయన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం కందిగడ్డ తండా గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తూ ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. గురుకుల ఫలితాలల్లో గణిత శాస్త్రం విభాగంలో జేఎల్, పీజీటీ, టీజీటీ ఉద్యోగాలను సాధించాడు. కాగా, స్వగ్రామం చర్లపల్లిలో కృష్ణమూర్తిని పలువురు అభినందించారు. కృష్ణమూర్తి ఐదుగురు సోదరులు, సోదరి ప్రభుత్వ ఉద్యోగాలు చేయడం గమనార్హం. కృష్ణమూర్తి పదో తరగతి వరకు చర్లపల్లిలో చదువుకున్నాడు. ప్రస్తుతం బీఎస్సీ, బీఈడీ పూర్తి చేశారు.

బయో కెమిస్ట్రీ ఇన్‌చార్జ్ హెడ్‌గా మధుకర్‌రావు

కేయూ క్యాంపస్, మార్చి 1: కేయూ బయో కెమిస్ట్రీ విభాగం ఇన్‌చార్జి హెడ్‌గా డాక్టర్ కె.మధుకర్‌రావును నియామిస్తూ శుక్రవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జిగా ఉన్న జంతుశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ జి.షమిత నుంచి బాధ్యతలు స్వీకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2007లో బయోకెమిస్ట్రీ విభాగంలో అధ్యాపకులుగా మధుకర్‌రావు నియమితులు కాగా, ఇప్పటివరకు 30 పరిశోధన పత్రాలను ప్రచురించారు. మధుకర్‌రావు నియామకంపై పలువురు అభినందనలు తెలిపారు.

6న జాబ్ మేళా

కాకతీయఖని, మార్చి 1: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశం కల్పించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి శ్యామల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేరుపొందిన ప్రైవేటు సంస్థలో 170 ఉద్యోగావకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈనెల 6న ప్రభుత్వ ఐటీఐ కళాశాల (పాత ప్రగతి భవన్)లో జాబ్‌మేళా నిర్వహించ నున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలు పైబడిన నిరుద్యోగులు అర్హులని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీఫార్మసీ, డీ ఫార్మసీ, బీబీఎం పాసైన వారు అర్హులను వివరించారు. అర్హత, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు విద్యార్హత సర్టిఫికెట్స్, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఈ నెల 6న ఉదయం 10.30 గంటలకు హాజరు కావాలని సూచించారు. .

ఓరియెంటేషన్‌కు హాజరుకావాలి

కలెక్టర్ భవేష్ మిశ్రా

కాకతీయఖని, మార్చి 1: పదో తరగతి పరీక్షల నిర్వాహణపై శనివారం నిర్వహించనున్న ఓరియెంటే షన్ కార్యక్రమానికి సంబంధిత అధికారులు విధిగా హాజరుకావాలని కలెక్టర్ భవేష్ మిశ్రా ఒక ప్రకటనలో ఆదేశించారు. భూపాలపల్లి కలెక్టరేట్‌లో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి పదో తరగతి పరీక్షలకు విధులు కేటాయించిన చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, సీ సెంటర్ కస్టోడియన్లు, మండల విద్యాశాఖ అధికారులు సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

ఈ-గ్రామ స్వరాజ్ పోర్టల్‌పై అవగాహన

కాటారం, మార్చి 1: పంచాయతీరాజ్ డెవలప్‌మెంట్ ఇండెక్స్ (పీడీఐ) ఈ-గ్రామ స్వరాజ్ పోర్టల్‌పై శుక్రవారం మండల స్థాయి అధికారులు, జీపీ కార్యద ర్శులకు అవగాహన కల్పించారు. ఎంపీపీ పంతకాని సమ్మయ్య అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ కార్యాల యంలో ఈ కార్యక్రమం జరిగింది. 2022-2023 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ-గ్రామ స్వరాజ్ పోర్ట ల్‌లో తొమ్మిది అంశాలపై అన్ని లైన్ డిపార్ట్‌మెంట్స్ వివరాలు అప్‌లోడ్ చేయడంపై ఎంపీడీవో అడ్డూరి బాబు, ఎంపీవో ఉపేంద్రయ్య అవగాహన కల్పిం చారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో దేవనాయక్, పలు శాఖల అధికారులు, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భూకబ్జాలపై దృష్టిసారించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి

భూపాలపల్లిటౌన్, మార్చి 1: భూకబ్జాలకు పాల్పడుతున్న వ్యక్తులపై ఎమ్మెల్యే దృష్టి సారించాలని ఓ మహిళ విజ్ఞప్తి చేసింది. తన పేరు బండి సరోజన అని, 24 ఏళ్లుగా భూపాలపల్లి పట్టణం లోని కృష్ణకాల నీలో నివాసముంటున్నానని తెలిపారు. ఓ కౌన్సిలర్ కుమారుడు తన అనుచరులతో వచ్చి తప్పుడు పత్రాలు సృష్టించి భూకబ్జాలకు పాల్పడుతున్నాడని ఆరోపించింది. తమ వద్ద అన్ని రకాల పత్రాలు ఉన్నప్ప టికీ అవి చెల్లవంటూ దబాయిస్తూ బెదిరిం పులకు పాల్పడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. తన ఆవేదనను వెల్లబుచ్చుతూ సోషల్ మీడియాలో ఆమె పోస్టు పెట్టింది.

సింగరేణి డిస్మిస్డ్ కార్మికులకు మళ్లీ కొలువు

కాకతీయఖని, మార్చి 1: సింగరేణి సంస్థలో పనిచేస్తూ డిస్మిస్ అయిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకునేం దుకు యాజమాన్యం అంగీకరించింది. ఈ క్రమంలో ఈనెల 6న కొత్తగూడెంలోని కార్పొరేట్ కార్యాల యంలో వారికి ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. అయితే భూపాలపల్లి ఏరియాలో 2022లో అప్పటి జీఎం మల్లెల సుబ్బారావు 2019 నుంచి 2022 సంవత్సరాలలో వంద మస్టర్లు లేని 48 మంది కార్మికులను విధుల నుంచి తొలగిం చారు. అందుకు నిరసనగా కార్మిక సంఘాల నాయకులు, డిస్మిస్డ్ కార్మికులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. దీంతో సింగరేణి యాజమాన్యం కొన్ని నిబంధనలు విధిస్తూ డిస్మిస్డ్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు అంగీకరిం చింది. ఈ నేపథ్యంలో ఏరియా నుంచి 12 మంది మాత్రమే అర్హత సాధించినట్లు తెలుస్తోంది. మిగిలిన 36 మంది కార్మికులకు యాజమాన్యం మొండి చేయి చూపించనుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

36 మందికి నష్టం

సింగరేణిలో పనిచేస్తూ డిస్మిస్ అయిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు యాజమాన్యం పలు షరతులు విధించింది. ప్రధానంగా డిస్మిస్ అయిన కార్మికుడికి 2023 ఏప్రిల్ 1 వరకు 46 ఏళ్ల లోపు వయసు ఉండాలి. అలాగే 2019 జనవరి 1 నుంచి 2022 సంవత్సరం పూర్తి అయ్యేనాటికి, గడిచిన ఐదేళ్లల్లో ఏదైనా రెండు సంవత్సరాల్లో కనీసం వంద మస్టర్లు కలిగి ఉండాలి. కండీషన్ పెట్టింది. ఈ నేపథ్యంలో ఏరియాలో 48 మంది డిస్మిస్ కాగా 12 మంది కార్మికులు మాత్రమే అర్హత సాధించినట్లు తెలుస్తోంది. అయితే సింగరేణి యాజమాన్యం ఎలాంటి కండీషన్స్ పెట్టకుండా తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిస్మిస్డ్ కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

బదిలీ వర్కర్లుగానే...

ఎన్నో సంవత్సరాలపాటు సింగరేణి సంస్థలో పనిచేసి కుటుంబ సమస్యలు, ఆరోగ్య సమస్యల కారణంగా డిస్మిస్ అయిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు విధించిన షరతులు ఇబ్బందికరంగా ఉన్నాయంటున్నారు కార్మికులు. 12 మంది కార్మికులు మాత్రమే అర్హత సాధించడంపై నిరాశ వ్యక్తమవుతోంది. మళ్లీ విధుల్లో తీసుకొనేందుకు యాజమాన్యం ఈనెల 6న కొత్తగూడెంలోని కార్పొరేట్ కార్యాలయంలో ఇంటర్వ్యూతో పాటు మెడికల్ ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించనున్నట్లు సమాచారం. అయితే వీరిని బదిలీ వర్కర్లుగానే తిరిగి విధుల్లోకి తీసుకోనున్నట్లు తెలుస్తోంది. దీంతో వారు గతంలో చేసిన సర్వీసు పరిగణనలోకి రాదనే తెలుస్తోంది. అలా అయితే వారికి తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉంది.

దళితులకు భూపంపిణీ చేయాలి

చిట్యాల, మార్చి 1: ప్రతి దళిత కుటుంబానికీ మూడెకరాల భూమిని పంపిణీ చేయాలని విముక్త చిరుతల పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు అనీల్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. మండలంలోని చైన్‌పాకలో శుక్రవారం దళితకాలనీలో పార్టీ ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. ప్రభుత్వం భూమిలో కాస్తులో ఉన్న దళితులకు భూపట్టాలు అందించాలన్నారు. లేని వారికి భూమిని కొనుగోలు చేసి పట్టాలు అందించాలని కోరారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్ ఆదేశాలతో ప్రతి గ్రామంలోనూ సర్వే చేపట్టామన్నారు.

కేటీఆర్‌కు బీఆర్ఎస్ శ్రేణుల ఘన స్వాగతం


కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

కాటారం, మార్చి 1: మేడిగడ్డ బ్యారేజీ సందర్శనకు శుక్రవారం భారీ కాన్వాయ్‌తో వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద ఘనస్వాగతం లభించింది. పలు మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కలిశారు. ఉదయమే మేడిగడ్డకు కేటీఆర్ బృందం వెళ్లనుందని తెలిసి తరలివచ్చిన శ్రేణులు సాయంత్రం 3.45 గంటల వరకు వేసి చూడాల్సి వచ్చింది. అప్పటి వరకు అక్కడే ఉండి ఎదురేగి స్వాగతం తెలిపారు. బస్సులో నుంచి బయటకు వచ్చిన కేటీఆర్‌కు జడ్పీ చైర్‌పర్సన్లు పుట్ట మధు, జక్కు శ్రీహర్షిణి బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి పుష్పగుచ్ఛం అందించి కండువా కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేటీఆర్ బీఆర్ఎస్ జై కేసీఆర్ జై అంటూ నినాదాలు చేస్తూ ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు తోట జనార్దన్, రామిళ్ల కిరణ్, జోడు శ్రీనివాస్, గట్టు రమేష్, రాజేందర్, సంతోష్, రవీందర్, అశోక్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'పల్స్ పోలియో'ను విజయవంతం చేయాలి

వెంకటాపూర్(రామప్ప), మార్చి 1: పోలియో నివారణ కోసం ఈనెల 3న మండలంలో నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి రిషిత అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో శుక్రవారం జరిగిన సమావేశంలో మండలస్థాయి అధికారులు, అంగన్‌వాడీలు, పంచాయతీ కార్యదర్శులు, వైద్యసిబ్బందికి పల్స్ పోలియోపై అవగాహన కల్పించారు. మండలంలో మొత్తం 31 కేంద్రాల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

- మొగుళ్లపల్లి: పల్స్‌పోలియో కార్యక్రమాన్ని మండల వ్యాప్తంగా విజయవంతం చేయాలని ఎంపీపీ యార సుజాత సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో వైద్యాధికారిణి నాగరాణి అధ్యక్షతన మండల అధికారులతో టాస్క్‌ఫోర్స్ సమావేశం జరిగింది. ఈసందర్భంగా సుజాత మాట్లాడుతూ మండలంలో 28 బూత్‌లు ఏర్పాటు చేయగా 3341మంది 0-5ఏళ్లలోపు చిన్నారులు ఉన్నారని, వారికి 3వతేదీన పోలియో చుక్కలు వేయాలన్నారు. ఈ కార్యక్రమం విజయవంతానికి ప్రజాప్రతినిధులు, మండల అధికారులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో జయశ్రీ, తహసీల్దార్ సునీత, ఎంఈవో ప్రభాకర్, మండల స్పెషలాఫీసర్ సునీత, పల్లె దవాఖాన వైద్యాధికారులు సంధ్య, వాణి, యాస్మిని, సరళ, విద్యాసాగర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటస్వామి, సూపర్‌వైజర్ సునీత, హెల్త్ అసిస్టెంట్ భిక్షపతి, సిబ్బంది పాల్గొన్నారు.
- కాటారం : ఈ నెల 3న నిర్వహించే పల్స్ పోలియోను విజయవంతం చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారి మౌనిక అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా మండల టాస్క్‌ఫోర్స్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ ఎల్స్ పోలియో కార్యక్రమంలో అప్పుడే పుట్టిన పాప నుంచి 5ఏళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలన్నారు.

ఏదైనా కారణాలతో పోలియో చుక్కలు వేసుకోని పిల్లలకు 4, 5వ తేదీల్లో ఇంటింటికీ వెళ్లి వేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఒపీడీవో బాబు, ఎంపీవో ఉపేంద్రయ్య, ఎంఈవో దేవానాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అరుణ, వీణ పాల్గొన్నారు.

మహిళా స్వావలంబనే లక్ష్యం

ఐకేపీ జిల్లా ప్రాజెక్టు అధికారి గోవింద్ చౌహాన్



మాట్లాడుతున్న గోవింద్ చౌహాన్

మంగపేట, మార్చి 1: మహిళా స్వావలంబనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని ఐకేపీ ప్రాజెక్టు అధికారి గోవింద్ చౌహాన్ అన్నారు. మండల కేంద్రంలోని జ్యోతి మహిళా మండల సమాఖ్య కార్యాలయంలో వీవోఏ, సీఆర్పీలకు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మహిళా సంఘాలను బలోపేతం చేయడమే ముఖ్యోద్దేశమన్నారు. ఆయా వృత్తుల్లో నైపుణ్యం ఉన్న మహిళలను గుర్తించి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తూ వీవోఏలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం అప్పారావు, ప్రాజెక్టు అసిస్టెంట్ మేనేజర్ సతీష్, డీఎంజీ శ్రీనివాస్‌రెడ్డి, సీసీలు డి. సత్యనారాయణ, మల్లేశ్వరి, జనార్దన్, సి.హెచ్. శ్రీను, తార తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఈ-కేవైసీ చేసుకోవాలి

- వ్యవసాయ శాఖ జిల్లా అధికారి విజయ్‌చంద్ర

ములుగు కలెక్టరేట్, మార్చి 1: ప్రధానమంత్రి కిసాన్ యోజన కింద లబ్ధి పొందుతున్న జిల్లాలోని రైతులు ఈ-కేవైసీ చేసుకోవాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి విజయ్‌చంద్ర అన్నారు. శుక్రవారం ఆయన ములుగు మండలంలోని బందారుపల్లి గ్రామాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ములుగు మండలంలో 210 మంది రైతులు ఇప్పటివరకు ఈ-కేవైసీ చేసుకోలేదని, వారు వెంటనే ఈ-కేవైసీ చేసుకోవాలని కోరారు. ఆయనవెంట మండల వ్యవసాయ అధికారి సంతోష్, ఏఈవో దీపక్, రైతులు ఉన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా కుమార్



ములుగు కలెక్టరేట్, మార్చి 1: బీజేపీ ములుగు మండల అధ్యక్షుడిగా పట్టణ కేంద్రానికి చెందిన గాదం కుమార్ నియమితులయ్యారు. ములుగులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం నియామకపత్రాన్ని అందజేశారు. సుదీర్ఘకాలంగా క్రియాశీలంగా వ్యవహరిస్తున్న కుమార్ పార్టీని బలోపేతం చేయడంలో కృషి చేస్తున్నారని, ఆయన సేవలను గుర్తించి మండల అధ్యక్షుడిగా నియమించామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య జవహర్‌లాల్, నాయకులు చల్లూరి మహేందర్, జినుకల కృష్ణాకర్, దొంతిరెడ్డి రవిరెడ్డి పాల్గొన్నారు.

అమరుల ఆశయాలను సాధించాలి

ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబు


అమరుల చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

ములుగు కలెక్టరేట్, మార్చి 1: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధనలో అసువులు బాసిన మాదిగ అమరవీరుల ఆశయాలను సాధిస్తూ ముందుకు సాగాలని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యాంబాబు అన్నారు. ములుగు బస్టాండ్ సెంటర్‌లో ని గల అంబేద్కర్ విగ్రహం ఎదుట శుక్రవారం ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరగగా అమరులైన వారి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పిం చారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యాంబాబు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు పార్లమెంట్‌లో బిల్లుపెట్టి చట్టబద్ధత కల్పించకుండా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలను నమ్మించి మోసం చేసిందని అన్నారు. ఈక్రమంలో గాంధీభవన్‌పై దాడిచేసిన ఘటనలో ప్రమాదవశాత్తు పొన్నాల సురేంద్ర, దామోదర్, మహేష్, భారతిలు తీవ్రంగా గాయపడి మృతిచెందారని అన్నారు. ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించాలని మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు కోతి కార్తీక్, దూడపాక రాజు, మరాఠి రవీందర్, తోకల రాంబాబు, పారునందుల శ్రీను, గడ్డం కుమార్, పెండెల సమ్మయ్య, బల్గూరి సూరయ్య, రాంచందర్ పాల్గొన్నారు.

భూపాలపల్లిలో..

భూపాలపల్లిటౌన్: అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో భూపాలపల్లిలో నిర్వహించారు. ఎస్సీలలో ఏబీసీడీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ చేసిన పోరాటంలో ఎంతోమంది అమరులయ్యారని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని, మాదిగలు, ఉపకులాలకు న్యాయం జరిగేలా వర్గీకరణ జరగాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి గాజుల బిక్షపతి అన్నారు. ఈ సందర్భంగా అమరవీరుల స్తూపం వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి అంబాల చంద్రమౌళి, నాయకులు అంతడుపుల సురేష్, తిరుపతి, మహేందర్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

మూడు ఉద్యోగాలు సాధించిన మహిళ

గతంలో జీపీ సెక్రటరీ ఉద్యోగం కూడా..


షబానా

కాటారం, మార్చి 1: ప్రస్తుత పోటీ యుగంలో ఒక ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే గగనం. ఓ మహిళ మాత్రం ఏకంగా మూడు ఉద్యోగాలు సాధించడం విశేషం. మండలంలోని రేగులగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని దేవరాంపల్లికి చెందిన షబానా గురుకులాలకు సంబంధించిన పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి 63వ ర్యాంక్‌తో గురుకుల జూనియర్ లెక్చరర్ (జేఎల్), 68వ ర్యాంక్‌తో పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ), ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టీజీటీ) ఉద్యోగాలు సాధించింది. ఎంఏ బీఈడీ చేసిన షబానా మొదటి నుంచి చదువులో చురుగ్గా ఉండేది. వివాహ అనంతరం ఉద్యోగం వేట సాగించింది. నాలుగేళ్ల క్రితం పంచాయతీ కార్యదర్శి ఉద్యోగం సాధించినా జాయినింగ్ రోజే సిజేరియన్ ద్వారా డెలివరీ కావడంతో చేరలేకపోయింది. అయినప్పటికీ నిరాశ చెందకుండా పట్టుదలతో ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచింది. షబానాను మాజీ సర్పంచ్ నవీన్‌రావు, గ్రామస్థులు అభినందించారు.

పీఏసీఎస్ వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మాన నోటీసు


డీసీవోకు అవిశ్వాస తీర్మాన నోటీసు ఇస్తున్న డైరెక్టర్లు

మల్హర్, మార్చి 1 : తాడిచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకర సంఘం వైస్ చైర్మన్ మల్క సూర్యప్రకాశ్‌రావుపై అవిశ్వాశ తీర్మానం ప్రవేశపెట్టేందుకు పలువురు డైరెక్టర్లు డీసీవో శైలజకు శుక్రవారం నోటీసు అందజేశారు. చైర్మన్ రామారావుపై పలు ఆరోపణలు రావడంతో జిల్లా అధికారులు ఆయన్ను తొలగించారు. వైఎస్ చైర్మన్ ప్రకాశ్‌రావుకు ఇన్‌చార్జి చైర్మన్ బాధ్యతలు అప్పగించారు. ఏడాదిపాటు ప్రకాశ్‌రావు ఇన్‌చార్జి చైర్మన్‌గా కొనసాగారు. ఈ మరో ఏడాదిలో పాలకవర్గం పదవీ కాలం ముగియనుండగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం ప్రటిస్తూ డైరెక్టర్లు నోటీసు ఇచ్చారు. అవిశ్వాసానికి ఏడుగురు సభ్యులు అవసరం ఉండగా తీర్మానం నెగ్గాలంటే తొమ్మిది మంది డైరెక్టర్ల మద్దతు కావాల్సి ఉంది. అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చిన నెల లోపు బలపరీక్ష నిర్వహించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో డైరెక్టర్లు రమేష్‌రెడ్డి, రాము, సురేష్ అవిశ్వాస తీర్మాన నోటీసును డీసీవో అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీల అందజేత

కాటారం, మార్చి 1: మండలంలోని శంకరంపల్లి గ్రామానికి చెందిన ఊరగొండ ప్రశాంత్, గంగారం గ్రామానికి చెందిన తాటిపాముల స్వరూపకు సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.2.10 లక్షలు, రూ.2.50 లక్షల విలువైన ఎల్‌వోసీ (లెటర్ ఆఫ్ కాన్సెంట్)లను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఇప్పించారు. అనారోగ్య సమస్యలతో చికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చేరిన బాధితుల కుటుంబ సభ్యులు వైద్య ఖర్చుల నిమిత్తం మంత్రి శ్రీధర్‌బాబును ఆశ్రయించారు. దీంతో ఆయన సీఎంఆర్ఎఫ్ ద్వారా ఇద్దరికి రూ.4.60 లక్షల విలువైన ఎల్‌వోసీలను మంజూరు చేయించారు. మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు ఎల్‌వోసీలను బాధితుల కుటుంబ సభ్యులకు ప్రైవేట్ పీఏ శుక్రవారం అందజేశారని శంకరంపల్లి, గంగారం తాజా మాజీ సర్పంచులు అంగజాల అశోక్, తెప్పల దేవేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ చీర్ల తిరుమల తిరుపతిరెడ్డి తెలిపారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

చిట్యాల, మార్చి 1: మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన తడుక భూమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శుక్రవారం పరామర్శిం చారు. మృతుడి కుమారులు సుధాకర్, కుమార్, తిరుపతిని కలిశారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు నల్ల రాజిరెడ్డి, బండి రాజు, మోర్తల వెంకన్న తదితరులు ఉన్నారు.

ఫొటోగ్రాఫర్‌కు జాతీయ అవార్డు



కేంద్ర సహాయ మంత్రి మీనాక్షిలేఖి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న శ్రావణ్

వెంకటాపూర్(రామప్ప), మార్చి 1: భారత మంత్రిత్వ సాంస్కృతిక శాఖ, లలితకళ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మేళా మూమెంట్ ఫొటోగ్రఫీలో వెంకటాపూర్ మండలంలోని పాలంపేట గ్రామానికి చెందిన తాడెండ్ల శ్రావణ్ ప్రతిభ చాటాడు. ప్రథమ బహుమతి సాధించి జాతీయ అవార్డు పొందాడు. కేంద్ర విదేశీ వ్యవహారాలు, సాంస్కృతిక శాఖ సహాయ మంత్రి మీనాక్షి లేఖి చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నాడు. న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఫొటో ప్రదర్శన జరగ్గా శ్రావణ్ పాల్గొన్నాడు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మంగపేట, మార్చి 1: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని స్త్రీ సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లేనినా అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగపేట ఎంపీడీవో కార్యలయంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమా నికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళలు ఆర్థికంగా ముందంజలో ఉండాలన్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగా కాకుండా ఈసారి వారం రోజులపాటు మహిళా దినోత్సవాన్ని నిర్వహించాలన్నారు. మహిళలు అందొచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని పురుషులకు సమానంలో ఆయా రంగాల్లో ముందుకు దూసుకెళ్లాలన్నారు. మైనారిటీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఈ.పి.ప్రమలత మాట్లాడుతూ ఆర్థిక స్వేచ్ఛతో కూడిన అభివృద్ధి మహిళల్లో ఉండాలన్నారు. మహిళా సాధికారత, వారి హక్కుల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళల రక్షణ కోసం టోల్‌ఫ్రీ నంబర్లు 181, 14567, 1098 అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ఏటూరునాగారం ప్రాజెక్టు అధికారి హేమలత, సూపర్‌వైజర్ చంద్రకళ, ఎంపీహెచ్ఎస్ గంగమ్మ, డీహెచ్ఈడబ్ల్యూ స్రవంతి, సఖి సాధన, మహిళా సంఘాల సభ్యులు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్ల పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు

మహదేవపూర్, మార్చి 1: మహదేవపూర్ తహసీల్దార్‌గా ప్రహ్లాద్ రాథోడ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కొమురంభీం జిల్లా తిర్యాణిలో పనిచేస్తున్న ప్రహ్లాద్ రాథోడ్‌ను పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భూపాలపల్లి జిల్లాకు బదిలీ చేశారు. మహదేవపూర్‌కు పోస్టింగ్ ఇవ్వడంతో ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

- వెంకటాపురం (నూగూరు): వెంకటాపురం నూతన తహసీల్దార్‌గా వీరభద్రప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ సదానందం బదిలీ అయ్యారు. దీంతో ఆయన స్థానంలో వెంకటాపూర్(రామప్ప) తహసీల్దార్‌గా పనిచేస్తున్న వీరభద్రప్రసాద్ విధుల్లో చేరారు.
- చిట్యాల: చిట్యాల మండల నూతన తహసీల్దార్‌గా ఎం.డి.ఖాజా మొహియొద్దీన్ బాధ్యతలు స్వీకరించారు. 15 రోజుల క్రితం బదిలీపై వచ్చిన తహసీల్దార్ ప్రహ్లాద్ మహదేవ్‌పూర్‌కు బదిలీ అయ్యారు. ములుగు జిల్లాలో పనిచేసిన మొహియొద్దీన్ బదిలీపై జయశంకర్ భూపాలపల్లికి రాగా చిట్యాల తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. తహసీల్దార్ మొహియొద్దీన్‌కు డిప్యూటీ తహసీల్దార్ శివతేజ, గిర్దావర్ భాస్కర్ల రాజు, ఏఎస్‌వో సాయికిరణ్, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.
- వెంకటాపూర్(రామప్ప): వెంకటాపూర్ తహసీల్దార్‌గా జి.సదా నందం బాధ్యతలు స్వీకరించారు. 15 రోజుల క్రితం ఇక్కడ తహసీ ల్దార్‌గా పనిచేసిన వీరభద్రప్రసాద్ సాధారణ బదిలీల్లో భాగంగా వెంకటాపురం(నూగూరు) మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వెంకటాపురం(నూగూరు) తహసీల్దార్‌గా పనిచేస్తున్న సదానందం వెంకటాపూర్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది ఆయనకు పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ ర్యాలీలు

మంగపేట, మార్చి 1: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో శుక్రవారం ర్యాలీలు నిర్వహించారు. మండల అధ్యక్షుడు పల్లెపోగు రాము మాదిగ పలుచోట్ల హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ సాధనలో అసువులు బాసిన మాదిగ అమరవీరులకు నివాళ్లు అర్పించారు. మాదిగ అమరవీరులు జాతి కోసం శ్రమించిన తీరు, ప్రాణ త్యాగాలు చిరస్మరణీయమన్నారు.